శ్మశానవాటికలో క్లీనింగ్ పనులు చేయాలి

దీపావళి సమీపిస్తున్నా.. వెంకటేశ్వర కాలనీ డివిజన్ పరిధిలో శ్మశాన వాటికల్లో క్లీనింగ్, లైటింగ్ ఏర్పాట్లు ప్రారంభం కాలేదని కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి శుక్రవారం జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతిని కలిసి ఫిర్యాదు చేశారు. దీపావళి రోజున పూర్వీకుల సమాధుల వద్ద పూజలు చేస్తుంటారని, చెత్తాచెదారం తొలగించడం, ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లు చేయాలని కార్పొరేటర్ కోరారు. దీనికి స్పందించిన జడ్సీ తగుచర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- బంజారాహిల్స్

వెలుగని వీధిదీపాలతో ప్రమాదాలు

మైలార్‌దేవ్‌పల్లి, దుర్గానగర్, కాటేదాన్, లక్ష్మీగూడ, ఆరాంఘర్, కాటేదాన్ ఓల్డ్ కర్నూల్ రోడ్డులో ప్రమాదాలు పెరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. డివైడర్లను ఢీకొని ప్రమాదాలు సంభవిస్తున్నాయని తెలిపారు.

- మైలార్‌దేవ్‌పల్లి

దళితుల అభివృద్ధికి సహకరించాలి

హిమాయత్‌నగర్ : దళితుల అభివృద్ధికి ప్రభుత్వం సహకరించాలని దళిత హక్కుల పోరాట సమితి నగర అధ్యక్షుడు రాజ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అద్దె ఇండ్లలో ఉండే దళితులకు స్థలం కేటాయించి ఇండ్లు నిర్మించాలన్నారు.

జోనల్ స్థాయి సమస్యలపై ఫోకస్

ఖైరతాబాద్, అక్టోబర్ 25 : జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ స్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై జడ్సీ అనురాగ్ జయంతి స్పెషల్ ఫోకస్ పెట్టారు. ఈ మేరకు సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు జోనల్ కార్యాలయంలో ప్రత్యేక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. శుక్రవారం వివిధ విభాగాల అధికారులతో జడ్సీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏఎంసీ శ్రీనివాస్ ఇన్‌చార్జిగా ఎంటామాలజీ, హెల్త్, వెటర్నరీ, యూబీడీ, ఇంజినీరింగ్ సెక్షన్, ఎలక్ట్రికల్ సెక్షన్ సమన్వయంతో సమస్యలపై దృష్టిసారిస్తారు. జీహెచ్ఎంసీ మై యాప్, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించడమే కాదు, ఆయా విభాగాలకు చెందిన సమస్యలను వర్క్ ఇన్‌స్పెక్టర్లు, రెవెన్యూ, ట్యాక్స్ ఇన్‌స్పెక్టర్ల ద్వారా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి పరిష్కరిస్తారు. ప్రతి రోజు ఎన్ని ఫిర్యాదులు అందాయి, క్షేత్రస్థాయిలో పర్యటించి సేకరించిన అంశాలు, పరిష్కారమైన వివరాలను జడ్సీకి సంబంధిత అధికారులు రిపోర్టును అందజేస్తారు.

సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి

నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయండి

డీఈ రమేశ్‌చంద్రకు వినతిపత్రం అందజేస్తున్న మణికొండ బీఆర్ఎస్ అధ్యక్షుడు సీతారాం దూళిపాళ , నాయకులు

మణికొండ, అక్టోబర్ 25 : మణికొండ మున్సిపాలిటీలో విద్యుత్ సమస్యలను పరిష్కరించి నాణ్యమైన విద్యుత్‌ను అందించేందుకు చర్యలు చేపట్టాలంటూ మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడు దూళిపాళ సీతారాం నేతృత్వంలో డీఈ రమేశ్‌చంద్రను కలిసి నాయకులు విన్నవించారు. పంచవటికాలనీ, తానాషా నగర్, హుడాకాలనీ, ఖిజ్రా కాలనీ, కేపీఆర్ కాలనీలో అంతరాయాలు, నెక్నాంపూర్ పరిధిలోని బాబుఖిల్స్‌లో త్రీ ఫేస్ సరఫరా, వెంకటేశ్వర కాలనీలో 11కేవీ లైన్, స్తంభాల ఏర్పాటు, ఇంటర్నెట్ వైర్ల కారణంగా ప్రమాద పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. నెమలీనగర్ కాలనీలో ట్రాన్స్‌ఫార్మర్‌తో ప్రమాదం ఉందని విన్నవించారు. ఓవర్‌లోడ్‌తో ట్రాన్స్‌ఫార్మర్లు పడై పోయాయని ఫలితంగా విద్యుత్ సరాఫరాలో అంతరాయం ఏర్పడుతుందని తెలిపామని అధ్యక్షుడు సీతారాం దూళిపాళ అన్నారు. స్పందించిన డీఈ క్షేత్రస్థాయి సిబ్బందికి సమాచారం అందించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఆలస్యం నవీన్‌కుమార్, నాయకులు రూపారెడ్డి, ధన్‌రాజు, ముత్తంగి లక్ష్మయ్య, అందె లక్ష్మణ్‌రావు, రాజేంద్రప్రసాద్, గుట్ట మీది నరేందర్, విఠల్, సంగం శ్రీకాంత్, కిరణ్, శ్రీధర్, రేఖ, అశ్వక్ అలీ పాల్గొన్నారు.

బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

మాట్లాడుతున్న తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకుడు బాలమల్లేశ్

హిమాయత్‌నగర్, అక్టోబర్ 25 : బీసీలకు జనాభా దమాషా ప్రకారం విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఇచ్చి.. చట్టసభల్లో రిజర్వేషన్లను కల్పించాలని తెలంగాణ బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర నాయకుడు ఎన్.బాలమల్లేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ కులగణన చేయాలని కోరుతూ.. ఈ నెల 28న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగే రాష్ట్ర సదస్సును బీసీలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శుక్రవారం మఖ్దూం భవన్‌లో మేడ్చల్ -మల్కాజ్‌గిరి జిల్లా బీసీ హక్కుల సాధన సమితి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులవృత్తులు ధ్వంసమై నూతన ఆర్థికవ్యవస్థలో అవకాశాలను అందుకోలేక బీసీలు దుర్భర జీవితాలను గడుపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీసీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని, వీరి అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ రంగంలోని పలు విభాగాల్లో బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేసి, అర్హులైన వారికి ప్రమోషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సీహెచ్.దశరథ్, టి.వెంకటేశ్వరరావు, ఆర్.కృష్ణమూర్తి, కె.ప్రమీల, కాసోజు మహాలక్ష్మి, బొడ్డుపల్లి కృష్ణ పాల్గొన్నారు.

నారాయణగూడ పీఎస్‌లో ఎస్సైల కొరత

మూడు నెలలుగా ఇద్దరే ఎస్సైలు

హిమాయత్‌నగర్, అక్టోబర్ 25 : నారాయణగూడ పీఎస్‌లో ఎస్సైలు లేకపోవడంతో పరిపాలన పరంగా అవాంతరాలు ఎదు రౌవుతున్నాయి. నలుగురు ఎస్సైలు బదిలీపై వేర్వేరు పీస్‌లకు వెళ్లిపోగా మూడు నెలలుగా ఇద్దరు ఎస్సైలు, సీఐ, డీఐ విధులు నిర్వహిస్తున్నారు. పెరుగు తున్న జనాభాకు అనుగుణంగా పోలీసు యంత్రాంగంను సైతం పటిష్టపర్చాల్సిన అవసరం ఉన్నప్పటికీ పోలీసు ఉన్న తాధికారులు దృష్టి సారించడంలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎస్సైలు, కానిస్టేబుల్స్ కొరత ఉండటంతో శాంతి భద్రతల పరిరక్షణ, క్లిష్ట సమయాల్లో ఉన్న సిబ్బందిపై ఒత్తిడి పెరుగుతున్నది. ఎస్సైల కొరతతో కేసుల దర్యాప్తు, నిందితుల వివరాలను సేకరిం చడంలో అంతరాయం ఏర్పడటంతో బాధితులకు సకాలంలో న్యాయం జరుగడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పీఎస్ పరిధిలోనే అత్యంత కీలకమైన కార్యాలయాలు, సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయి. ప్రముఖుల నివాసాలు, ఏఐటీ యూనీ, సీపీఐ రాష్ట్ర కార్యాలయాలు, టూరిజం ప్రధాన కార్యాలయం, పంచాయితీరాజ్ కార్యా లయం, ఐఎన్‌టీయూసీ కార్యా లయం, ఐపీఎం, కింగ్‌కోఠి జిల్లా దవాఖాన వంటి ప్రభుత్వ, ప్రభుత్వయేతర కార్యాలయాలతో పాటు, విద్యాసంస్థలు, కోచింగ్ సెంటర్లు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలున్నాయి. ఈ ప్రాంతాల్లో నిత్యం ఏదో ఒక నిరసన కార్యక్రమం ఉండటంతో బందోబస్తు ఉండాల్సిన పరిస్థితి ఉన్నది. ఉన్నతాధికారులు స్పందించి ఈ పీఎస్‌కు ఎస్సైలను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మణికొండ : నార్సింగి, మార్కెట్‌యార్డు, కోకాపేట, వట్టి నాగులపల్లి, ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్ పరిధిలో కొత్త సర్వీసులు రిలీజింగ్, పలుచోట్ల మరమ్మతుల కారణంగా శనివారం (నేడు) పలుచోట్ల అంతరాయం ఏర్పడనుందని ఏఈ మణికంఠ శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. నార్సింగి బృందావన్‌కాలనీ 11 కేవీ ఫీడర్ ఉదయం 11 : 30 నుంచి 12 గంటల వరకు, శ్రీకృష్ణ గోశాల ఫీడర్ ఉదయం 10 : 30 నుంచి 11 గంటల వరకు, మార్కెట్‌యార్డు సబ్ స్టేషన్ పరిధిలో బాలాజీనగర్ ఫీడర్ ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు, మంచిరేవుల, మంత్రివిల్లాస్, గ్రీన్‌ల్యాండ్, జైహింద్ కాలనీ, వివేకానందనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 11 : 30 నుంచి 12 గంటల వరకు వివేకానంద నగర్, నార్సింగి గ్రామం, నార్సింగి హైట్స్, కుభా కాలనీ, ఖస్వా కాలనీ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందని తెలిపారు. కోకాపేట సబ్‌స్టేషన్ పరిధిలో బాబూఖాన్ ఫీడర్ మధ్యాహ్నం 12 నుంచి 12 : 30 గంటల వరకు సరఫరా నిలివేయడంతో గోల్డెన్ మైల్ కాలనీ, బాబూఖాన్ విల్లాలు, గ్రాండ్ ఇన్‌ఫ్రాటెక్ విల్లాలు, దంతూ స్ట్రీట్ ప్రాంతాల్లో అంతరాయం ఉంటుందన్నారు. వట్టినాగులపల్లి సబ్‌స్టేషన్ పరిధిలోనూ మధ్యాహ్నం 12 నుంచి 12 : 30 గంటల వరకు ఖానాపూర్ గ్రామం, ఓఆర్ఆర్ సర్వీసు రోడ్డు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. ఇబ్రహీంబాగ్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్‌లోఉదయం 10 : 30 నుంచి 11 గంటల వరకు రాందేవ్‌గూడ గ్రామం, వన్‌మోర్‌నగర్‌కాలనీ, నెక్నాంపూర్ గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న త్రిపుర గవర్నర్ ఇంద్రసేనారెడ్డి

స్వదేశీ భావన ప్రతిఒక్కరిలో రావాలి

ఖైరతాబాద్, అక్టోబర్ 25 : స్వదేశీ భావన అనేది ప్రతి భారతీయుడిలో రావాలని త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రసేనా రెడ్డి అన్నారు. స్వదేశీ జాగరణ్ మంచ్, స్వావలంబి భారత్ అభియాన్ సంయుక్తాధ్వర్యంలో నెక్లెస్‌రోడ్‌లోని పీపుల్స్‌ప్లాజాలో ఏర్పాటు చేసిన స్వదేశీ మేళాను శుక్రవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ.. స్వదేశీ మేళా మన గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని వెలుగులోకి తీసుకువచ్చే వేదిక అని అన్నారు. బాహ్య దేశాలపై ఆధారపడకుండా మన సొంత వనరులను గుర్తించడం, వాటినే వినియోగించడం ద్వారా స్వయం సంవృద్ధి సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వెంకటేశ్వర్ రావు, స్వదేశీ జాగరణ్ మంచ్ తెలంగాణ ప్రాంత కన్వీనర్ హరీశ్ రావు, గంగోత్రి డెవలపర్స్ చైర్మన్ మధురాం రెడ్డి, స్వావలంబి భారత్ అభియాన్ ప్రాంత కన్వీనర్ జి. రమేశ్ గౌడ్, స్వదేశీ మేళా కన్వీనర్ ఇంద్రసేన్ రెడ్డి, స్వదేశీ జాగరణ మంచ్ ప్రాంత కో -కన్వీనర్లు సిద్దుల అశోక్, ఈశ్వర పాల్గొన్నారు.

పండ్లు పంపిణీ

ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కింగ్‌కోఠి దవాఖానలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. సయ్యద్ జావీద్, దిలీప్ రెడ్డి, ముజ్జులాల్, కమల, తాజ్, శివ, కిరణ్, అరుణ్ పాల్గొన్నారు.

- హిమాయత్‌నగర్

సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 25 : అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. హోలియో దాసరి సంఘం కమిటీ సభ్యులు నూతన కమ్యూనిటీ హాల్ నిర్మాణం విషయం తమ దృష్టికి తీసుకురాగా.. జీహెచ్ఎంసీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లి స్థలాన్ని కేటాయించాలని కోరామన్నారు. ప్రభుత్వ స్థలాన్ని గుర్తించామని కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నర్సింహామూర్తి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాహుల్, కిరణ్, దేవులపల్లి దాసు, తలారి చిన్న, శ్రీకాంత్‌రెడ్డి, గణేశ్ ముదిరాజ్, కిషన్, శంకర్, నిహాల్‌యాదవ్, పాండుయాదవ్, అమర్, రమేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

సదర్‌ను విజయవంతం చేయాలి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 25 : ఎన్టీఆర్ స్టేడియంలో 27న మాజీ ఎంపీ అంజన్‌కుమార్ యాదవ్, రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సదర్ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని యూత్ కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు పిల్లి దుర్గాప్రసాద్‌యాదవ్ కోరారు. బీహార్ మాజీ ముఖ్యమంత్రులు లాలూప్రసాద్ యాదవ్, ఆయన సతీమణి రబ్రీదేవి, ఆ రాష్ట్ర మాజీ మంత్రి తేజ్‌ప్రతాప్ యాదవ్‌ను కలిసి ఆహ్వాన పత్రిక అందజేశామని వివరించారు. శుక్రవారం బీహార్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకున్న సందర్భంగా వివరాలు మీడియాకు వివరించారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు భద్రత

జూబ్లీహిల్స్ : అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు భద్రత ఉంటుందని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సంజయ్‌నగర్‌లో నూతనంగా వేసిన పెయింటింగ్ వర్క్స్, మౌలిక సదుపాయాలతో ఆధునీకరించిన కేంద్రాన్ని సందర్శించి సేవలను అభినందించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. చిన్నారులకు మొదటి గురువుగా అంగన్‌వాడీ టీచర్లు బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ భారతి, యునైటెడ్ వే బెంగళూరు (ఎన్‌జీఓ) తెలంగాణ ప్రతినిధులు సయ్యద్ ఖదీర్, షేక్ అక్రం పాల్గొన్నారు.

డీఎస్సీలో ఉద్యోగం పొందిన అభ్యర్థినికి అభినందనలు

డీఎస్సీలో ఉద్యోగం పొందిన రాజీవ్ గాంధీ నగర్‌కు చెందిన భువనేశ్వరిని కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అభినందించారు. శుక్రవారం అభ్యర్థిని ఇంటికి వెళ్లి తల్లిదండ్రుల సమక్షంలో శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు.

కరాటేలో సత్తాచాటారు..

యూసుఫ్‌గూడ, శ్రీకృష్ణానగర్‌లోని శ్రీసాయిసరస్వతి విద్యానికేతన్ విద్యార్థులు డీఆర్ఎస్ ఇంటర్నేషనల్ స్కూల్ నిర్వహించిన ఇంటర్ స్కూల్ కరాటే పోటీల్లో సత్తా చాటారు. మార్షల్ ఆర్ట్స్ బాలికల అండర్ - 12 విభాగంలో యశస్వి బంగారు పతకంతో మెరిసింది. ఇదే విభాగంలో పి.యుతిక రజతం.. బాలుర విభాగంలో డానీ పునీత్‌రాజ్, సిరిశ్రీ కాంస్యం సాధించగా.. అండర్ - 14 విభాగంలో ఎం.సాహితి కాంస్యం దక్కించుకుంది. ఈ సందర్భంగా పాఠశాల వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ శిరీష శంకర్, హెచ్ఎం ఉషామీనాక్షి గెలుపొందిన విద్యార్థులు, కరాటే కోచ్ మాస్టర్ ఎం.వాసుదేవ్‌ను అభినందించారు.

- జూబ్లీహిల్స్

ఓ ఇంట్లో చోరీకి యత్నం

- ముగ్గురిపై కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబర్ 25 : అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీకి ప్రయత్నించిన ఘటన ఫిలింనగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్ నం.92 లోటస్‌పాండ్‌కు ఎదురుగా ఉంటున్న ఆర్కిటెక్ట్ సంఘమిత్ర పెర్వార్ ఇంట్లోకి ప్రవేశించేందుకు రెండ్రోజుల క్రితం అర్ధరాత్రి గుర్తుతెలియని ముగ్గురు యత్నించారు. ప్రహరీ దూకి లోనికివెళ్లే క్రమంలో అలికిడి కావడంతో సంఘమిత్ర సోదరుడు మేఘమిత్ర కేకలు పెట్టడంతో పారిపోయారు. పెట్రోలింగ్ పోలీసులకు సమాచారమివ్వగా అక్కడికి చేరుకుని సీసీ కెమెరాలు పరిశీలించారు. వారివద్ద ఆయుధాలు ఉన్నట్లు కనిపించడంతో చోరీ కోసమే వచ్చినట్లు తేలింది. పోలీసులు అక్కడి నుంచి వెళ్లిన రెండు గంటల తర్వాత ఆగంతకులు సమీపంలో పార్క్‌చేసిన బైక్‌ను తీసుకువెళ్లారని, విచారణ చేపట్టాలని గురువారం రాత్రి సంఘమిత్ర ఫిలింనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అమీర్‌పేట్ మెట్రోస్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీకి యత్నం

దొంగను పట్టుకుని పోలీసులకు అప్పగింత

వెంగళరావు నగర్, అక్టోబర్ 25 : అమీర్‌పేట్ మెట్రోస్టేషన్‌లో ఓ ప్రయాణికుడి సెల్ చోరీ చేసేందుకు దొంగ విఫలయత్నం చేశాడు. అప్రమత్తమైన ప్రయాణికుడు దొంగను పట్టుకోగా.. మెట్రో సిబ్బంది పోలీసులకు అప్పగించారు. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఉప్పల్ నుంచి మియాపూర్ వెళ్లేందుకు ముసలయ్య మెట్రో ఎక్కారు. అమీర్‌పేట్ జంక్షన్‌లో రైలు మారేందుకు దిగాడు. ముసలయ్య సెల్‌ను కాజేసేందుకు దొంగ ప్రయత్నించాడు. అప్రమత్తమైన అతడు దొంగను పట్టుకుని మెట్రోస్టేషన్ కంట్రోలర్ జి.శ్రీనివాస్‌కు సమాచారం ఇచ్చారు. పట్టుబడ్డ దొంగను కంట్రోలర్ మధురానగర్ పోలీసులకు అప్పగించారు. నిందితుడు దేవకుమార్‌గా పోలీసులు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మంగళ సూత్రం అపహరణ

వెంగళరావునగర్, అక్టోబర్ 25 : వృద్ధురాలి మంగళసూత్రం అపహరించిన ఘటన ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సనత్ నగర్ జెక్‌కాలనీలోని లక్ష్మి అపార్ట్‌మెంట్స్‌లో ఉండే 64 ఏండ్ల కృష్ణకుమారి గురువారం సాయంత్రం కాలనీలో వాకింగ్‌కు వెళ్లింది. ఈకోకంట్రీ అపార్ట్‌మెంట్ వద్దకు రాగానే తలపై టోపీ పెట్టుకున్న ఆగంతకుడు ఆమె మెడలోని 3 తులాల బంగారు మంగళసూత్రం తెంచుకుని అక్కడే పార్క్ చేసిన ద్విచక్ర వాహనంపై పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాలపై ఉక్కుపాదం

భవనంలో కూల్చివేతను పరిశీలిస్తున్న టౌన్ ప్లానింగ్ ఏసీపీ కృష్ణవేణి

జూబ్లీహిల్స్, అక్టోబర్ 25 : యూసుఫ్‌గూడలో అక్రమ నిర్మాణాలపై టౌన్ ప్లానింగ్ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శుక్రవారం లక్ష్మీనరసింహనగర్‌లో అనుమతులు లేకుండా నిర్మించిన నాలుగంతస్తుల భవనంలో కూల్చివేతలు చేపట్టారు. ఎల్ఎన్ నగర్‌లో సుశీల కిష్టమ్మ ఇం.నం. 8-3-234/105లో జీహెచ్ఎంసీ పర్మిషన్ లేకుండా రెండు నాలుగంతస్తుల భవనాలు నిర్మించారు. విశ్వసనీయ సమాచారంతో ఆయా భవనాలను టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాక్షికంగా కూల్చివేశారు. దీంతోపాటు శ్రీకృష్ణానగర్‌లో ఇం.నం.8-3-231/88/ఎ/1 లో పిల్లర్లు నిర్మించి భవన నిర్మాణాన్ని చేపట్టే దశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు అనుమతులు లేకుండా నిర్మిస్తున్న సదరు పిల్లర్‌లను కూడా కూల్చివేశారు. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్ డీసీ జాకియా సుల్తానా ఆధ్వర్యంలో ఏసీపీ కృష్ణవేణి సిబ్బందితో కలిసి కూల్చివేతలు చేపట్టారు. టీపీఎస్ఓ నరేశ్, సిబ్బంది పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ అనుమతులు లేకుండా భవనాలను నిర్మిస్తే కూల్చివేస్తామని టౌన్ ప్లానింగ్ ఏసీపీ హెచ్చరించారు. ఇండ్లమధ్య ఉన్న భవనాలు పూర్తిస్థాయిలో కూల్చివేయడం కుదరకపోతే ఆయా భవనాలను సీజ్ చేస్తామని తెలిపారు.

వారసత్వంగా సంక్రమించిన భూమికోసం న్యాయపోరాటం

హైకోర్టు పత్రాలు చూపుతున్న వలీయుద్దీన్ ఖాన్

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 25 : శంషాబాద్ పట్టణంలోని సర్వే నం. 626/ 1లో 12.4 ఎకరాలు తమకు వారసత్వంగా సంక్రమించిన్నట్లు వివరించారు. హైకోర్టులో న్యాయపోరాటం చేస్తున్నట్లు హైదరాబాద్‌కు చెందిన వలీయుద్దీన్‌ఖాన్, ఆయన తరపు న్యాయవాది మీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. శుక్రవారం శంషాబాద్‌లో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ.. కొందరు ఉద్దేశ్య పూర్వకంగా తప్పుదోవ పట్టిస్తున్నట్లు వివరించారు. ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. తమ ఆధీనంలో ఉన్న భూమిలో హెచ్ఎండీఏ, రెవెన్యూ జ్యోకం చేసుకోవడం తగదంటూ హైకోర్టు గత నెల ఆదేశాలు జారీ చేసిందని వివరించారు. ఆదేశాల పత్రాలను మీడియా సమావేశంలో చూపించారు. కోర్టులో పోరాడుతున్న భూమిపై న్యాయస్థానం ఇచ్చే తుది తీర్పు మేరకు తాము నడుచుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. కానీ తమ భూమిని ఆధీనంలోకి తీసుకోవడం కోసం నాలుగురు వ్యక్తులు తమను, అధికారులను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిపారు. వివాదాస్పదంగా ఉన్న సంబంధిత భూముల్లో తాము ఎలాంటి చర్యలకు పాల్పడడం లేదన్నారు. మాకు ఇబ్బందులకు గురి చేస్తున్న వారిపై పోలీసులకు ఫిర్యాదు చేశామని వివరించారు. ఈ విషయంపై పోలీసులను విచారణ కోరగా వారి నుంచి ఫిర్యాదు వచ్చింది. విచారణ చేసి కేసు నమోదు చేస్తామని ఎస్సై రాచమంద్రయ్య తెలిపారు.

ప్రేమించాలంటూ లేడీస్ హాస్టల్ వద్ద.. బ్లేడ్‌తో చేయి కోసుకున్న యువకుడు

వెంగళరావునగర్, అక్టోబర్ 25: ప్రేమించిన యువతి తనను దూరం పెట్టిందన్న మనస్తాపంతో ఓ యువకుడు లేడీస్ హాస్టల్ బయట బ్లేడ్‌తో చేతులను కోసుకున్నాడు. ఈ ఘటన ఎస్ఆర్ నగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భద్రాద్రి - కొత్తగూడెం జిల్లాకు చెందిన యువతి అదే ప్రాంతానికి చెందిన బాల్‌రాజ్ 2022లో కొత్తగూడెంలోని కళాశాలలో డిగ్రీ చదువుకున్నారు. ఆ సమయంలో ఇద్దరూ స్నేహితులయ్యారు. తర్వాత ప్రేమలో పడ్డారు. ఉన్నట్టుండి బాల్‌రాజ్ ప్రవర్తనలో మార్పు వచ్చింది. యువతిని అనుమానించాడు. వేధింపులకు గురిచేసి కాళ్లూ, చేతులు బ్లేడ్‌తో కోసుకుంటానని బెదిరించాడు. దీంతో ఆ యువతి అతడిని దూరం పెడుతూ వచ్చింది. ఆమె ఓ సంస్థలో టెలీకాలర్‌గా పనిచేస్తూ అమీర్‌పేటలోని ఓ హాస్టల్‌లో ఉంటుంది. విషయం తెలుసుకున్న బాల్‌రాజ్ గురువారం రాత్రి యువతి ఉంటున్న హాస్టల్ వద్దకు వచ్చి హల్‌చల్ చేశాడు. తనను ప్రేమించాలని, పెండ్లి చేసుకోవాలని యువతిని బెదిరించి అందరూ చూస్తుండగానే బ్లేడ్‌తో చేతులను కోసుకున్నాడు. దీంతో భయపడిన యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

లక్ష్మీరామ్ హరన్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

మైలార్‌దేవ్‌పల్లి, అక్టోబర్ 25 : అత్తాపూర్ డివిజన్ లక్ష్మీరామ్ హరన్ ప్లాట్ యజమానుల సొసైటీ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. మ్యూచువల్లీ ఎయిడెడ్ కో - ఆపరేటివ్ సొసైటీ నిబంధనల ప్రకారం ఏర్పాటైన కార్యవర్గానికి జిల్లా కో-ఆపరేటివ్ అధికారి సుధాకర్ ఆమోద ముద్ర వేశారు. ఎల్ఆర్‌హెచ్ ప్లాట్ ఓనర్స్ మెయింటెనెన్స్ మ్యూచువల్లీ ఎయిడెడ్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ అసోసియేషన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా శీలం సాయిసత్యనారాయణరెడ్డి, ఉపాధ్